క్లుప్తంగా

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

గుర్రంకొండ: మండలంలోని చెరువుమొరవపల్లె, రెడ్డివారిపల్లె, కురువపల్లె, దళితవాడ, మొరంపల్లె గ్రామాల్లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు సింగిల్‌విండో డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి చెరువుమొరవపల్లెలో కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. మండల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

8 మంది జూదరుల అరెస్ట్

కలకడ : కోడిపందెం ఆడుతున్న 8 మందిని జూదరులను అరెస్టు చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సిటి స్వామి తెలిపారు. వివరాలిలాఉన్నాయి. ఆదివారం సాయంత్రం మండలంలోని ఎనుగొండపాళ్యం పంచాయతీ రంగప్పగారిపల్లె సమీపంలో కోడిపందెం ఆడుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్‌ఐ తన సిబ్బంది రమేష్, శ్రీనివాసులు, యోగేష్, రాజేంద్ర, తాతయ్య, ప్రతాప్ తదితరులతో దాడి చేశారు. కోడిపందెం ఆడుతున్న వారి నుంచి రూ.7,470 నగదు, రెండు కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రామసముద్రం: మండలంలోని చెంబకూరు పంచాయతీ టేకుపల్లి సమీపంలోని చెరువులో కోడిపందేలు ఆడుతున్న నలుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ రవీంద్రబాబు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చెరువు దగ్గర ఉన్న ఖాళీ ప్రదేశంలో కోడిపందేలు ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేశామన్నారు. జూదరులను అరెస్ట్ చేసి వారి నుంచి రెండుకోడి పుంజులు, రూ.2300 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని తెలిపారు.

బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శిగా రెడ్డిప్రసాద్

మదనపల్లె సిటీ: మదనపల్లెకు చెందిన బీసీ సంఘం నాయకులు బెల్లే రెడ్డిప్రసాద్ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ ఆ సంఘ జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య నియామకపత్రాలు అందజేశారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో నియామకపత్రం అందజేసినట్లు తెలిపారు. బీసీ సంఘ అభివృద్ధికి మరింత శక్తివంచనలేకుండా పనిచేస్తానని రెడ్డిప్రసాద్ తెలిపారు.

ప్రశాంతంగా ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీవైఈఓ క్రిష్ణప్ప

మదనపల్లె సిటీ: జాతీయ ఉపకార వేతనం (ఎన్‌ఎంఎంఎస్) పరీక్ష ఆదివారం మదనపల్లె పట్టణంలో ప్రశాంతంగా జరిగింది. పట్టణంలో ఐదు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. 1144 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా అందులో 1119 మంది పరీక్షకు హాజరయ్యారు. డీవైఈఓ క్రిష్ణప్ప పరీక్ష కేంద్రాలను తనిఖీలు చేశారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

రామసముద్రం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ కుసుమకుమారి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండలంలోని అన్నిశాఖల అధికారులు అభివృద్ధి పనులు పూర్తి నివేదికలతో రావాలన్నారు. అలాగే సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అన్నిశాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

రజక సంఘం కమిటీ ఎన్నిక

గుర్రంకొండ: గుర్రంకొండ గ్రామ రజక సంఘం నూతన కమిటీని ఆదివారం జిల్లా రజక సంఘం ఉపాధ్యక్షుడు నాగరాజు ఆధ్వర్యంలో ఎన్నుకొన్నారు. అధ్యక్షుడిగా శ్రీనివాసులు, గౌరవాధ్యక్షుడిగా రామయ్య, ఉపాధ్యక్షుడిగా ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా శివప్రసాద్, కోశాధికారిగా వేణుమాధవ్, సభ్యులుగా కేశవ, మునుస్వామి, తిమ్మయ్య, సుబ్రమణ్యం, నాగరాజు, తిరుమలేశ, అశోక్, శివకుమారిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా సంఘం నాయకులు మల్లికార్జున, నాగరాజ పాల్గొన్నారు.

రైతు పొలంలోకి అక్రమంగా ప్రవేశించి దాడి

బి.కొత్తకోట: ఓ రైతు పొలంలో అక్రమంగా ప్రవేశించి దాడిచేసి ఘటనపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రామమోహన్ ఆదివారం తెలిపారు. కోటావూరు పంచాయతీ నాయనబండ్లపల్లెకు చెందిన రైతు టి.నారాయణ (54)కు కాండ్లమడుగు వద్ద 45 సెంట్ల పొలం ఉంది. శనివారం సాయంత్రం పొలంలోకి కొంతమంది అక్రమంగా ప్రవేశించి తమపై దాడిచేశారని బాధితుడు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు తొమ్మిది మంది నిందితులపై కేసు నమోదు చేసి విచారిస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

నలవీరగంగాభవానీ జాతరకు వేళాయె

- కోర్కెలు తీర్చే కల్పవల్లిగా ప్రసిద్ధి
- తరలిరానున్న వేలాది మంది భక్తులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ
- నేటి నుంచి 9వ తేదీ వరకు ఉత్సవాలు



విద్యుత్ వెలుగుల్లో అమ్మవారి ఆలయం



జాతరకు ఆట వస్తువుల ఏర్పాటు

మదనపల్లె సిటీ: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరుగాంచిన మదనపల్లె మండలం సీటీఎంలో వెలసిన శ్రీ నలవీరగంగాభవానీ జాతరకు సర్వం సిద్ధమైంది. జాతర సోమవారం నుంచి గురువారం వరకు అంగరంగ వైభవంగా జరగనుంది. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతి ఏటా భారత పౌర్ణమి మరుసటి రోజు నుంచి జాతర నిర్వహిస్తారు. సీటీఎం, సీటీఎం క్రాస్, కొత్తవారిపల్లె, దబ్బిగానిపల్లె పంచాయతీ పరిధిలోని 120 గ్రామాల్లో జాతరను నిర్వహిస్తారు. జాతరకు గ్రామంలోని ప్రజలే కాకుండా పొరుగు జిల్లాలు చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి,కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు వస్తారు. ఇటీవల ఆలయానికి రూ.కోటిపైగా ఖర్చుచేసి సుందీకరణ చేశారు. 6న సోమవారం సిద్దుల భక్తి, అమ్మవారి ఊరేగింపు, 7న మంగళవారం రాత్రి తిరునాల, అమ్మవారి ఊరేగింపు, 8న పగలు తిరునాల, క్లిపాటు, అమ్మవారి ఊరేగింపు,9న దోపు తిరునాలతో జాతర ముగుస్తుంది. దీంతో పాటు 9 నుంచి 13 వరకు ఎద్దుల పరష ఘనంగా నిర్వహిస్తారు.

కోరిన కోర్కెలు తీరే అమ్మవారు

కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారిగా పేరుపొందిన నలవీర గంగభవానీ అమ్మవారి పేరు ప్రఖ్యాతులున్నాయి. దాదాపు 300 ఏళ్ల కిందట సీటీఎం పరిసర ప్రాంతాలు వరదలు వచ్చి గ్రామాలకు ముంపు ఏర్పడింది. గ్రామ ప్రజలు ఊరి పొలిమేర్లలోని అమ్మవారికి కాపాడాలని మొక్కుకున్నారు. అమ్మవారు గ్రామాలకు వరదముప్పు రాకుండా ఆదుకున్నది. దీంతో స్థానికులు ప్రతి ఏటా భారతాల పౌర్ణమి మరుసటి రోజు నుంచి జాతర నిర్వహిస్తున్నారు.

అమ్మవారి పుట్టినిల్లు మిట్టపల్లె

అమ్మవారి పుట్టినిల్లు మిట్టపల్లె. ప్రతి ఏటా జరిగే జాతరకు రెడ్డప్ప ఇంటి వద్ద నుంచి అమ్మవారికి చీర,బోనం ఊరేంపుగా తీసుకెళ్తారు. అనంతరం ఉత్సవాలు ప్రారంభిస్తారు.



నలవీర గంగాభవానీ

భక్తుల కోసం ఏర్పాట్లు

భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. క్యూ ఏర్పాటు చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని రంగు రంగు విద్యుత్‌దీపాలతో అలంకరించారు.

చాందినీ బండ్లు స్పెషల్

జాతరకు చాందినీ బండ్లు ప్రత్యేకత. అమ్మవారికి మొక్కులు కోసం భక్తులు చాందీని బండ్లు కడతారు. గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ఊరేగింపుగా అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. దీంతో పాటు అన్నం బండ్లు, టెంకాయపట్ల బండ్లు కూడా వస్తాయి. చాందినీ బండ్లు చూసేందుకు భక్తులు అధిక సంఖ్యలో వస్తారు. భక్తుల కోసం ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు నడుపుతున్నట్లు డీఎం నిరంజన్ తెలిపారు. 7, 8 తేదీల్లో ప్రత్యేక సర్వీసులు నడుస్తాయన్నారు. తాలూకా పోలీసులు జాతరకు గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

చేతి వృత్తులు వేల చరిత్రకు గుర్తులు

కురబలకోట: చేతి వృత్తులు వేల చరిత్రకు గుర్తులని వీటిని ప్రోత్సహించేందుకు శాయశక్తులా కృషి చేస్తానని బీజేపీ రాజంపేట పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి సాయిలోకేష్ అన్నారు. కురబలకోట మండలంలోని అంగళ్లులో ఆదివారం ఆయన టిర్రకోట సీఎఫ్‌సీ సెంటర్‌ను సందర్శించారు. టిర్రకోట కళాకారులతో ముఖాముఖి నిర్వహించారు. వారి సాదక బాధలను తెలుసుకున్నారు. ఉన్నత స్థాయికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతి వృత్తులు సమాజంలో భాగమన్నారు. సంస్కృతి, సంస్కారం, సంప్రదాయాలకు ప్రతీక అన్నారు. ఈ సందర్భంగా ఆయన ఉత్తమ హస్త కళాకారులను సత్కరించారు. టిర్రకోట హస్తకళాకారుల సంఘం నాయకులు దుర్గం మల్లికార్జున, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

13 నుంచి గులామ్ అలీషా దర్గా ఉరుసు

మదనపల్లె సిటీ: స్థానిక చిత్తూరు బస్టాండు వద్ద నున్న గులామ్ అలీషా దర్గా ఉరుసు ఉత్సవాలు ఈనెల 13 నుంచి ప్రారంభమవుతున్నట్లు దర్గా మకాన్‌దార్ దస్తగిరి తెలిపారు. 13న గంధం, 14న ఉరుసు, 15న తహలీల్‌ఫాతెహా జరుగుతుందన్నారు. గంధం రోజును అన్నప్రసాదం కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

వైభవం.. శ్రీజనార్దనస్వామి రథోత్సవం



రథంపై ఊరేగుతున్న శ్రీలక్ష్మీజనార్దనస్వామి

రామసముద్రం: మండల కేంద్రంలో వెలసిన శ్రీలక్ష్మీ జనార్దనస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు యధావిధిగా నిర్వహించారు. వేద పండితులచే వేదమంత్రోచ్ఛరణతో హోమాలు, శాంతిపూజలు చేశారు. మధ్యాహ్నం శ్రీదేవి,భూదేవి సమేత శ్రీలక్ష్మీజనార్దనస్వామిని రథంపై పురవీధుల్లో ఊరేగించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో భక్తులు పోటిపడుతూ స్వామివారిని పుర వీధుల్లో ఊరేగించారు. ఆలయం వద్ద శ్రీకృష్ణదేవ రాయ కులస్తులు భక్తులకు అన్నదానం చేశారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ప్రత్యేక క్యూఏర్పాటు చేశారు. పుంగనూరు, మదనపల్లె ప్రాంతాలలో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రం నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి రథోత్సవంలో పాల్గొన్నారు.

పేదలకు ప్రభుత్వ పథకాలు అందించేందుకు కృషి



డ్రిప్ రమణ

పెద్దతిప్పసముద్రం: పేద ప్రజలందరికీ ప్రభుత్వ పథకాలు అందించేందుకు కృషి చేస్తానని జగనన్న గృహ సారధి, సచివాలయం మండల కన్వీనర్ డ్రిప్ రమణ అన్నారు. ఆదివారం ఆయన మండలంలో ప్రభుత్వ పథకాలపై విస్తృత అవగాహన కలిపించారు. ఆయన మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారుల సమన్వయంతో పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ట



మదనపల్లె సిటీ: మదనపల్లె మండలం చిప్పిలి గ్రామంలో వెలసిన శ్రీ సత్యనారాయణస్వామి ఆలయంలో ఆదివారం ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. ఉదయం ఆలయంలో హోమాలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు అమరనాథ్, రామకృష్ణ, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి సారె సమర్పణ



సారెను తీసుకువస్తున్న కుముదా వేణి

మదనపల్లె సిటీ: మదనపల్లె మండలం సీటీఎంలో వెలసిన శ్రీ నలవీర గంగాభవానీ అమ్మవారి జాతర ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మిట్టపల్లెకు చెందిన కాట్లకంటి కుముదా వేణి, శ్రీనివాసులురెడ్డిలు పుట్టినింటి సారెను అందజేశారు. అమ్మవారి దర్శించుకుని ఆలయ అర్చకులకు సారెను అందించారు. పూర్వీకుల నుంచి వస్తున్న సంప్రదాయం ప్రకారం నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

మున్సిపాలిటీలో అభివృద్ధి చేసి చూపిస్తాం

–ఎమ్మెల్యే నవాజ్‌బాషా



భూమిపూజలో ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె: మదనపల్లె మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు చేసి చూపిస్తామని ఎమ్మెల్యే ఎం.నవాజ్ బాషా అన్నారు. ఆదివారం స్థానిక చౌడేశ్వరి కల్యాణ మండపం వద్ద రూ.76 లక్షలతో రింగ్‌రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో అభివృద్ధి పనులు కావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. వారి ఆకాంక్షలను నెరవేరుస్తామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాల మేరకు పని చేస్తామన్నారు. రాజంపేట ఎంపి మిథున్‌రెడ్డి సహకారంతో స్పెషల్ గ్రాంటు కింద రూ.38 కోట్లతో ఏడాదిలోపు పనులు పూర్తి చేస్తామన్నారు. మున్సిపాలిటీతో పాటు గ్రామాల్లో కూడా అభివృద్ధి పనులకు చేస్తామన్నారు. మున్సిపల్ చైర్మన్ మనూజరెడ్డి, కౌన్సిలర్లు మేస్త్రీ శ్రీనివాసులు, రామకృష్ణారెడ్డి, వెంకటరమణ, షేక్ ముబీనా, కమిషనర్ ప్రమీల, డీఈ శిరీషా తదితరులు పాల్గొన్నారు.

రెడ్డెమ్మకొండపై మాఘపౌర్ణమి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకారణలో రెడ్డెమ్మతల్లి

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయంలో ఆదివారం మాఘపౌర్ణమి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు చేశారు. ఉదయాన్నే అమ్మవారికి నైవేద్యం సమర్పించి పలు కార్యక్రమాలు నిర్వహించారు. సంతానం కోసం మహిళలు ఆలయపరిసరాల్లో ఆకుపసరు సేవించి అమ్మవారి ఎదుట వరపడ్డారు. సంతానం కలిగిన భక్తులు అమ్మవారికి చీరె, సారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు భక్తులు ఆలయంలో అన్నదానం నిర్వహించారు. హిందువులతో పాటు ముస్లింలు అమ్మవారి ఆలయానికి పెద్ద ఎత్తున తరలిరావడం విశేషం.

సుబ్రమణ్యేశ్వర స్వామికి ఆర్‌డీఓ పూజలు



స్వామివారి సన్నిధిలో ఆర్‌డీఓ మురళి దంపతులు

వాల్మీకిపురం : పట్టణ పడమర పొలిమేరలోని శ్రీ కార్యసిద్ధి అభయాంజనేయ స్వామి సమూహ దేవాలయంలో వెలసిన శ్రీ సుబ్రమణ్య స్వామికి మదనపల్లి ఆర్‌డీఓ మురళి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం ఆర్‌డీఓ దంపతులకు షిరిడి సాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవ ట్రస్ట్ సభ్యులు స్వాగతం పలికారు. వేదపండితులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు సుబ్రమణ్యస్వామికి ప్రత్యేక పూజలు అర్చన నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఘనంగా సత్యనారాయణస్వామి వ్రతం



సత్యనారాయణ స్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

పీలేరు : స్థానిక సదుం మార్గంలోని శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో మాఘమాసం పౌర్ణమిని పురస్కరించుకుని సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం ఘనంగా నిర్వహించారు. శ్రీ రమాదేవి సమేత సత్యనారాయణ స్వామికి విశేష పూజా కార్యక్రమాలు చేపట్టారు. గణపతి పూజ, నవగ్రహపూజ, పంచపాలక, అష్టదిక్పాలక పూజలు చేశారు. సత్యనారాయణస్వామికి పంచామృత అభిషేకము, అష్టోత్తర శతనామావళి పురాణోక్తంగా చేపట్టారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ట



నూతన ఆలయంలో కొలువుదీరిన ఎల్లమ్మ

కలికిరి: మండలంలోని గుట్టపాళెం గ్రామం జంగంపల్లిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ట చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో రెండు రోజుల పాటు విశేష పూజా కార్యక్రమాలు, మండప హోమాలు, మూల విగ్రహ గ్రామోత్సవం నిర్వహించారు. ఆదివారం ఉదయం యంత్ర విగ్రహ ప్రతిష్ఠ, ప్రతిష్ఠ కళాహోమాలు, ప్రాణప్రతిష్ఠ అనంతరం పూర్ణాహుతి, కుంభాభిషేకములు, అమ్మవారి అలంకరణ, మంగళహారతి నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ఘనంగా ఆదిగంగమ్మ విగ్రహ ప్రతిష్ట

కేవీపల్లె : మండలంలోని జిల్లేళ్లమంద పంచాయతీ పెండ్లిపెంటలో నూతనంగా నిర్మించిన శ్రీ ఆదిగంగమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన మంగివారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం తెల్లవారిజామున అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. భక్తులకు దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, మైనారిటీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్, జెడ్పీటీసీ గజ్జెల శృతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి, యూత్ మండల కన్వీనర్ గజ్జెల శీన్‌రెడ్డి, పలువురు గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ



బహుమతులు అందుకుంటున్న క్రీడాకారులు

పీలేరు రూరల్ : వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు లయన్ వర్రా గురివిరెడ్డి ఇండోర్‌స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఏపీ మాస్టర్స్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో పీలేరు క్రీడాకారులు ప్రతిభ చూపారు. చిత్తూరు ఉమ్మడి జిల్లా తరపున పీలేరుకు చెందిన కె. రఫీ, చిత్తూరుకు చెందిన వేణుగోపాల్ జోడీ మెన్స్ డబుల్స్ విభాగంలో విశేష ప్రతిభ చూపారు. ఈ పోటీల్లో రన్నర్స్‌గా నిలిచి బహుమతులు పొందినట్లు వారు తెలిపారు. టోర్నమెంట్ నిర్వాహకులు సింగం భాస్కర్‌రెడ్డి, గురవారెడ్డి, జిలానీ చేతుల మీదుగా మెమెంటోలు, ప్రశంసా పత్రాలు పొందారు.

కురవంకలో ఆక్రమణల తొలగింపు



పునాదులు తొలగించిన దృశ్యం

మదనపల్లె సిటీ: మండలంలోని పొన్నూటిపాళెం పంచాయతీ కురవంకలో సర్వే నంబర్ 412లో వాగు పొరంబోకులో అక్రమంగా నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణాలను ఆదివారం రెవెన్యూ అధికారులు తొలగించారు. వంకలో అక్రమంగా మూడు ఇళ్ల పునాదులు చేపడుతుండటంతో జేసీబీతో తొలగింపజేశారు. వంకల్లో అక్రమంగా ఇళ్లు నిర్మిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ శ్రీనివాసులు హెచ్చరించారు.

నూతన వధూవరులకు ఎమ్మెల్యే ఆశీర్వాదం



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కలకడ : కలకడ సర్పంచ్ ప్యారీజాన్ మనుమరాలు, వైఎస్సార్ సీపీ జిల్లా మైనారిటీ కార్యదర్శి షావత్‌అలి కాన్ కుమర్తెతో ఆదర్శ పాఠశాల విద్యా కమిటీ చెర్మన్ కెఎస్ మస్తాన్ కుమారుడు ఆఫ్తాప్ అహమ్మద్ వివాహం జరిగింది. వివాహ మహోత్సవానికి ఆదివారం ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, రాష్ట్ర మైనార్టీ కమిషన్ చెర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహమ్మద్, ఎంపీపీ శ్రీదేవి, సింగిల్ విండో అధ్యక్షుడు కమలాకర్ రెడ్డి, జిల్లా రాజగోపాల్‌రెడ్డి తదితరులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

మరమ్మతులకు నోచుకోని జనరేటర్

కరెంటు పోతే ఆలయంలో అంధకారమే



ఆలయంలో మరమ్మతుకు నోచుకోని జనరేటర్

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కరెంటుపోతే అంధకారం నెలకొంటోంది. రెండేళ్ల క్రితం ఆలయం దగ్గర ఏర్పాటు చేసిన జనరేటర్ మరమ్మతులకు గురైంది. అప్పటి నుంచి జనరేటర్‌ను పట్టించుకోకపోవడంతో ఆలయంలో ఇబ్బంది నెలకొంది. స్థానిక స్వామివారి ఆలయ ప్రాంగణంలోనే శ్రీవెంకటేశ్వరస్వామి భక్తురాలు శ్రీ తరిగొండ వెంగమాంబ ఆలయం ఉంది. 15 ఏళ్ల క్రితం ఈ ఆలయాన్ని టీటీడీ వారు దత్తత తీసుకొన్నారు. అనంతరం ఆలయానికి అవసరమైన కొత్త జనరేటర్‌ను ఏర్పాటు చేశారు. రెండేళ్ల క్రితం జనరేటర్ మరమ్మతులకు గురైంది. అప్పటి నుంచి టీటీడీ అధికారులు జనరేటర్‌ని బాగుచేయలేదు. కరెంటు సరఫరా లేని సమయంలో భక్తులు అంధకారంలో మగ్గుతున్నారు. వచ్చేనెల నుంచి స్వామివారి బ్రహ్మోత్సవాలు 11 రోజులపాటు ఘనంగా నిర్వహించనున్నారు. ఆలయంలో పలు అభిషేకాలు, అర్చనలు నిర్వహించే సమయంలో కరెంటు పోతే భక్తులతో పాటు అర్చకులు ఇబ్బందులు పడుతున్నారు. జనరేటర్‌ను వినియోగంలోకి తీసుకురావాలని భక్తులు కోరుతున్నారు. ఈవిషయమై టీటీడీ ఇన్స్‌పెక్టర్ కృష్ణమూర్తిని వివరణ కొరగా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు.